తుంది కదా అని ఆలోచిస్తున్నాను" అన్నాడు రాంబాబు.

"అలాగే సార్" అని వెళ్ళి వచ్చి చలానా రశీదు అందించాడతను.

రాంబాబు ఆ అరగంటలో అతని పని చేసిపెట్టాడు.

"థాంక్సండీ" అని అతను వెళ్ళిపోయాడు.

"అరే..చలానా తాలూకు డబ్బులు తీసుకోకుండానే వెళ్తున్నాడేమిటి? పోన్లే..అతడిష్టం. మనం ఇవ్వనన్నామా?" అనుకున్నాడు రాంబాబు.

* * *

"ఇంత తొందరగా నా పని చేసిపెడతారని నేననుకోలేదు. ఎన్ని రోజులు తిరగాలో అనుకున్నాను. మీ రుణం ఎలా తీర్చుకోవాలో అర్థం కావడం లేదు. చాలా థాంక్స్ సార్"

"అబ్బే..దానికేవుందండి..కానీ మీగురించి ప్రత్యేకంగా కష్టపడ్డాననుకోండి" అన్నాడు రాంబాబు.

"నేను ముక్కు సూటిగా మాట్లాడతాను. నాకిలాంటి విషయాలు పూర్తిగా తెలియవు. ఎంతిమ్మంటారు? చెప్పండి"

"మేం అడగడం ఏమిటి సార్. మీకు తోచినంత ఇవ్వండి. ఇందులో బలవంతం ఏముందని. అయినా మీకు తెలియందేముందండి. ధరలు ఆకాశాన్నంటుతున్న రోజులివి. రెండు వందలిస్తున్నారా? సరే..థాంక్యూ" జేబులో పెట్టుకున్నాడు రాంబాబు.

* * *

"ఏమిటయ్యా..ఇదేమన్నా బావుందా? నానా కష్టాలు పడి మీ పని పూర్తి చేస్తే ముష్టి యాభై రూపాయలే? ఛీ! ఛీ! మిమ్మల్ని అని ఏం లాభం? ఈ లోకం తీరే ఇంత. అసలు తప్పు నాది. మరో నాల్రోజులు తిప్పుకుంటే మీరే దారికొచ్చేవారు" కోపంగా అన్నాడు రాంబాబు.

"అలా అనకండి. మీరు ఆనందంగా వుండడమే మాకు కావాలి. ఇంకో యాభై వుంచండి"

"మీకు తెలియదు. ఆ పని జరగాలంటే కనీసం మూడు వందలైనా అవుతుంది"

"అలా అంటే ఎలా సార్..కాస్త దయ చూపండి"

"నన్ను విసిగించకయ్యా..అవతల నాకు బోల్డంత పని వుంది" కసురుకున్నాడు.

"సార్..సార్..మొత్తం రెండు వందల యాభై చేసుకోండి"

"ఇదేవన్నా కూరగాయల బేరం అనుకున్నావా? అలా కొసురుతావు?"

"సరే..సర్..ఇస్తాను"

"ఇప్పుడయ్యా నువ్వు నాకు నచ్చావ్" సంతోషంగా అతని తాలూకు కాగితాలు ముట్టుకున్నాడు రాంబాబు.

* * *

"ఏడుకొండలవాడా, వెంకటరమణా..నువ్వు దయామయుడివయ్యా. భక్తుల కష్టాలను తీర్చేవాడివి నీవేనయ్యా. అయిదేళ్ళ క్రిందట అణాకాను గురించి అష్టకష్టాలు పడ్డాను. ఇప్పుడు ఆరులక్షలు బ్యాంకులో వున్నాయి. ఇదంతా నీ దయే తండ్రీ. అన్నట్టుగానే మాట తప్పకుండా ప్రతి ఏటా తలనీలాలిస్తున్నా. ముడుపులు తక్కువగా ఇస్తున్నందుకు నాకు బాధగా వుంది స్వామీ..అందుకని నిన్నో చిన్న కోరిక కోరుకుంటున్నాను. ఇకనుంచి నా ఆదాయాన్ని రెట్టింపు చెయ్యి స్వామీ. పెరిగిన సంపాదనలో సరిగ్గా సగం నీకు ముడుపు కడతాను తండ్రీ" రాంబాబు కళ్ళు మూసుకుని భక్తిగా దేవుడ్ని ప్రార్థించాడు.

కొన్నాళ్ళకి రాంబాబు, రావణుడిగా ప్రజల్లో పేరు సంపాదించాడు.

**-యం. జి. రహమాన్** (బుగ్గారం)

# ఆచరణ

"నాన్నా" పిలిచాడు చింటూ. మేడ మీద పండు వెన్నెల. చల్లగా గాలి వీస్తోంది. రామారావు చింటూతో మంచాల పైకి చేరాడు.

రామారావు ఒక ప్రభుత్వ కార్యాలయంలో గుమాస్తా. జానకి అనుకూలవతి అయిన భార్య. వారి ఏకైక సంతానం ఏడేళ్ళ మురళి. వాడిని ముద్దుగా చింటూ అని పిలుచుకుంటారు రామారావు దంపతులు. వారికి చింటూ అంటే ప్రాణం. తనకున్న కొద్దిపాటి ఆర్థిక వనతిలోనే చింటూను ఎలాంటి లోటులేకుండా పెంచుతున్నారు. వాడి చదువుపైన ఎంతో శ్రద్ధ. వాడి భవిష్యత్తుపై ఎన్నో ఆశలున్నాయి వారికి. అందుకే శక్తికి మించినదైనా ఊరిలో మంచిదైన కాన్వెంట్‌లో ఇంగ్లీషు మీడియంలో చేర్పించాడు రామారావు. చింటూ రెండవ తరగతి చదువుతున్నాడు. వాడు ముద్దు ముద్దుగా ఇంగ్లీషు పదాలు పలుకుతుంటే వారి ఆనందానికి అవధులుండవు.

"నాన్నా" కొంచెం పెద్దగా పిలిచాడు చింటూ. ప్రకృతి ఆనందాన్ని ఆస్వాదిస్తున్న రామారావు చింటూని దగ్గరకు తీసుకొని "ఏంటి నాన్నా" అన్నాడు ప్రేమగా వాడి తల నిమురుతూ.

"నాన్నా! ఎగ్జిబిషన్‌కు తీసుకుని వెళతానన్నావుగా. రేపే ఆఖరి రోజు. తర్వాత వెళ్ళిపోతుంది" అన్నాడు. నిజమే ఊళ్ళోకి ఎగ్జిబిషన్ వచ్చి నెలరోజులైంది. ప్రతిసారి ఏదో పనుండి తీసుకువెళ్ళలేకపోతున్నాడు. మర్నాడు సోమవారం కూడా పని ఎక్కువగా ఉంటుంది. సెలవు ఇవ్వడు బాస్ ఆలోచనలో పడ్డాడు.

"ఎలాగో వీలుకుదుర్చుకొని వెళదామండీ. చింటూ కూడా ముచ్చటపడుతున్నాడు" అంది మంచినీళ్ళ చెంబు ప్రక్కన పెడుతూ జానకి. ఆవిడకు కూడా ముచ్చటగా ఉందని గ్రహించాడు రామారావు. "సరే రేపు వెళదాంలే" అన్నాడు ఒక నిర్ణయానికి వస్తూ. "మీ బాస్ సెలవు ఇవ్వడేమో" అంతలోనే సందేహం వెలిబుచ్చింది జానకి. "ఏదో అడ్జస్టు చేస్తాలే. ఒకరోజు సిక్‌లీవ్ పెట్టి డాక్టర్ సరిఫికెట్ ఇస్తే సరిపోతుంది" అన్నాడు రామా



రావు. చింటూ ఆనందానికి అవధులు లేవు. వాడికి ఆ రాత్రంతా ఎగ్జిబిషన్‌లో తిరిగిన కల వస్తూనే ఉంది.

మర్నాడు జానకి, చింటూలతో రామారావు ఎగ్జిబిషన్‌కు వెళ్ళివచ్చాడు. చింటూ, జానకిలతో పాటు రామారావు కూడా ఎంతో ఎంజాయ్ చేసాడు.

మర్నాడు పొద్దున జానకి మామూలుగానే లేచి చింటూ బడికి తీసుకువెళ్లే టిఫిన్‌బాక్స్‌ను సర్ది చింటూను నిద్రలేపింది. చింటూ ఒళ్ళు విరుచుకొని మళ్ళీ పడుకున్నాడు. "చింటూ బడి టైమ్ అవుతోంది త్వరగా లే" అంది మళ్ళీ జానకి.

"అమ్మా..అమ్మా" అంటూ నసిగాడు చింటూ. "ఈరోజు స్కూలు కెళ్ళనమ్మా. ఒళ్ళంతా నొప్పులుగా ఉన్నాయి" అన్నాడు మెల్లగా. అంతెత్తు లేచింది జానకి "నిన్న ఎగ్జిబిషన్ అని మానేశావు. మళ్ళీ ఈరోజు మానతావా" అంది పెద్దగా అరుస్తూ.

ఇంతలో రామారావు లేచాడు. చింటూ మాటలు విని రామారావు కూడా వాడిపై కేకలేసాడు "రెండురోజులు మానితే మీ టీచరు కేకలేస్తుంది. లే.. మెల్లగా లేస్తే ఒళ్ళు నొప్పులు తగ్గుతాయి" అన్నాడు.

చింటూ మెల్లగా నసుగుతూ "నేను కూడా ఒంట్లో బాగోలేదని చెప్పి డాక్టర్ సర్టిఫికెట్ ఇస్తే టీచరు ఏమీ అనదు. నువ్వు కూడా మీ ఆఫీసులో అలాగే చేస్తానన్నావుగా" అన్నాడు. వాడికి కొంత భయం ఉన్నా తండ్రి దగ్గర ఉన్న గారాబంతో అనేసాడు. రామారావు గతుక్కుమన్నాడు. ఏం చెప్పాలో తెలీలేదు. పెద్దలు సరిగ్గా ప్రవర్తించకుండా పిల్లలను క్రమశిక్షణగా ఉండమంటే వారు ఎలా ఉంటారు? అలా అనే హక్కు పెద్దలకు ఎలా ఉంటుంది. ఆచరించి చెప్పమన్న బుద్ధుడి మాటలు ఆచరించేదెవరు?

**-ఆర్.ఉదయభాస్కర్** (ముంబాయి)